# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 228
VEKUVA SAMAYAM TELUGU DAILY
* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: మంగళవారం 22 సెప్టెంబర్ 2026







**సమయం ప్రతినిధి:** దిగువ సభకు (స్టేట్ డుమా) జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు పుతిన్ అనుకూల యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం సాధించింది. చెప్పుకోదగిన ప్రతిపక్ష పార్టీలు లేకపోవడంతో పుతిన్ పార్టీ విజయం నల్లేరుమీద నడకలా మారింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యాలో ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. రష్యా దిగువ సభలో మొత్తం 450 సీట్లు ఉంటాయి. వీటిలోని సగం సీట్లల్లో పార్టీలు అభ్యర్థులను పోటీలోకి దింపుతాయి. మిగిలిన సగం సీట్లలో (పార్టీ లిస్టు) ప్రజలు నేరుగా పార్టీలనే ఎంచుకుంటారు. పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. 5 శాతానికి దిగువ ఓట్లు సాధించిన పార్టీలకు ఎలాంటి సీట్ల కేటాయింపు ఉండదు. రష్యా మీడియా కథనాల ప్రకారం, ఇప్పటివరకూ 90 శాతం ఓట్ల కౌంటింగ్ పూర్తైంది. డుమాలోని మొత్తం సీట్లలో యునైటెడ్ రష్యా పార్టీకి 355 సీట్లు లభించగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యాకు 40 సీట్లు లభించాయి. లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి 25 సీట్లు, న్యూపీపుల్ పార్టీకి 20 సీట్లు దక్కాయి. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజల మద్దతు పుతిన్‌కు దక్కిందని అధికార పార్టీ ఘనంగా ప్రకటించింది.ఇదిలా ఉంటే, తాజా విజయంతో పుతిన్ మరింత మంది రష్యన్లను సైన్యంలోకి చేర్చుకునే అవకాశం ఉందన్న భయాలు కూడా ఉన్నాయి. పుతిన్ మాత్రం అలాంటి ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. పార్లమెంటు దిగువ సభతో పాటు రష్యాలోని వివిధ ప్రాంతాలు, పుర పాలక సంస్థలు, గవర్నర్‌ల పరిధిలోని ప్రాంతాలకు ఎన్నికలు జరిగాయి. ముఖ్యంగా పోలింగ్ చివరి రోజున డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ విరుచుకుపడింది.




**సమయం ప్రతినిధి:** ఢిల్లీ సెషన్స్ కోర్టులో కాంగ్రెస్ నేత సోనియా గాంధీకి చుక్కెదురైంది. ఆమె ఓటరు నమోదు వివాదంలో ఢిల్లీ సెషన్స్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన ఫిర్యాదును కొట్టివేస్తూ మేజిస్ట్రేట్ కోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ప్రత్యేక న్యాయస్థానం రద్దు చేసింది. ఆ ఉత్తర్వులో తగిన కారణాలు లేవని పేర్కొంటూ.. ఫిర్యాదును చట్ట ప్రకారం.. మరోసారి పరిశీలించి, సరైన కారణాలతో కూడిన ఉత్తర్వులివ్వాలని మేజిస్ట్రేట్ కోర్టును ఆదేశించింది. సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో ఆమె పేరు నమోదైందని న్యాయవాది వికాస్ త్రిపాఠి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె పేరు 1980లోనే ఢిల్లీ ఓటరు లిస్టులో ఉందని పేర్కొన్న ఆయన.. ఆ తర్వాత 1982లో పేరు తొలగించారని, 1983లో మరలా నమోదైందని వాదించారు. కానీ వాస్తవానికి ఆమె.. 1983లో భారత పౌరసత్వం పొందారని పేర్కొన్నారు. కాగా.. ఈ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు గతంలో తిరస్కరించింది. దీంతో ఆయన సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే.. దిగువ కోర్టు ఉత్తర్వులో ఫిర్యాదులోని ఆరోపణలకు అనుగుణంగా తగిన కారణాలేవీ నమోదవలేదని పేర్కొన్నారు. వీటిపై ఢిల్లీ పోలీసుల నుంచి స్టేటస్ రిపోర్ట్ కోరేందుకు తగిన అవకాశం ఇవ్వకుండానే మేజిస్ట్రేట్ తిరస్కరించిందన్నారు.




**సమయం ప్రతినిధి:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ హైకోర్టు తనపై విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై దానం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో మెన్షన్ చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం బుధవారం(సెప్టెంబర్ 23) విచారణ జరపనుంది. తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇటీవల దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా తెలంగాణ హైకోర్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. దానంపై అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్కార్ గుడ్‌న్యూస్




**సమయం ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిబంధనలను సడలిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. బేస్‌మెంట్ లేదా పైస్థాయికి చేరిన ఇళ్లకు వన్‌టైమ్ ద్వారా క్లియరెన్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా L3 నుంచి L1 కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతి కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుం దని తెలిపారు. అర్హత ఉన్న నిర్మాణాల్లో నిధుల విడుదలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. ఈ ప్రత్యేక సడలింపు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో L3 మంజూరులకు ఈ సడలింపు వర్తించదని తెలిపారు. సడలింపుతో ఏర్పడే ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లను రద్దు చేస్తున్నామని.. రద్దైన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.




**సమయం ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన చేస్తూ ప్రజల మద్దతు పొందుతుంటే 22ఏ అంటూ రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్‌పై టీపీసీసీ సీనియర్ నేత రమ్యారావు మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకుందని విమర్శించారు. సోమవారం గాంధీ భవన్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు. 'మాకు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. నేను కేసీఆర్ సొంత అన్న బిడ్డను. కేటీఆర్ ఆరోపిస్తున్నట్లుగా ఆ వందల ఎకరాలలో మా భూమి ఎక్కడ ఉంది? నేను, కవిత ఇద్దరం ఇంటి వాళ్లం. మేము కాకుండా సంబంధంలేని సంతోష్ రావు కేసీఆర్ దగ్గర ఎందుకు ఉంటున్నాడు? ఆయన అడ్డగోలుగా సంపాదించి నన్ను, కవితను ఇంటి నుంచి బయటకు పంపిస్తే నువ్వు (కేటీఆర్) ఎందుకు మౌనంగా ఉంటున్నావు? నీకు సంతోష్ బినామీనా? ఎందుకు భయపడుతున్నావు?' అని రమ్యారావు వ్యాఖ్యానించారు. సంతోష్ రావుకు 2013లో క్వారీలో 25 శాతం వాటా ఉండేదని, 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులో ముంపుకు గురైందంటూ సంతోష్ ఇంటి వాళ్లందరూ ఇళ్ల పట్టాలు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. కుదురుపాక గ్రామానికి సంబంధం లేని వారు కూడా ప్లాట్లు తీసుకున్నారని విమర్శించారు. కుదురుపాక గ్రామంలో ఒక్క సంతోష్ రావు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి 8 ప్లాట్లు తీసుకున్నారని ఆమె ఆరోపించారు.

## జర్నలిస్టు శ్రీనివాసులు మృతి తీరని లోటు
## తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జర్నలిస్టులు

**అంత్యక్రియలకు ముందు పార్థివదేహానికి నివాళులర్పించిన జర్నలిస్టులు**
**కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేత**



**మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 21 (వేకువ సమయం ప్రతినిధి):** సీనియర్ పాత్రికేయులు శ్రీనివాసులు అకాల మరణం జర్నలిస్టు వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గుండెపోటుతో శ్రీనివాసులు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతివార్త తెలుసుకున్న జర్నలిస్టులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీనివాసులు ఈనాడు, నమస్తే తెలంగాణ, జనంసాక్షి తదితర దినపత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ పాత్రికేయ వృత్తిలో తనదైన గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆదాబ్ హైదరాబాద్ దినపత్రిక జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన అకాల మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు.శ్రీనివాసులు పార్థివదేహానికి జర్నలిస్టులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంక్షేమ సంఘం నేతలు వాకిటి అశోక్ కుమార్, మల్లు మధుసూదన్ రెడ్డి, జిల్లెల రఘు, రామకాంత్ రెడ్డి, సంతోష్ కుమార్, కేశవులు, ప్యాట వెంకటయ్య, బిజీ రామాంజనేయులు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ,
## ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 (వేకువ సమయం ప్రతినిధి):** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై సోమవారం సంబంధిత జిల్లా కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా మరో రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద నిల్వ ఉంచకుండా లబ్ధిదారులకు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి, పెండింగ్ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. నిధులు సరిపోకపోతే అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. రైతులతో నేరుగా చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టాలని సూచించారు.ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను తొలిప్రాధాన్యతగా పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సుమారు రూ.3,101 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆఖరి మానవ రచయిత ఇంకా ఎంతెంత దూరం?

సాహిత్యం ఎప్పుడూ ప్రశ్నల మధ్యనే బతికింది. మనిషి ఎవరు? ప్రేమ అంటే ఏమిటి? మరణం తర్వాత మిగిలేదేమిటి? జ్ఞాపకం మనిషిలో ఉంటుందా, మనిషే జ్ఞాపకంలో ఉంటాడా? అన్నవే ఆ ప్రశ్నలు. కాలం మారినప్పుడల్లా ప్రశ్నల రూపం మారింది. ఇప్పుడు కృత్రిమ మేధ సాహిత్యం ముందు నిలబెడుతున్న ప్రశ్నలు మాత్రం మరింత అసౌకర్యమైనవి. యంత్రం సృష్టించిన సాహిత్యానికి యజమాని ఎవరు? కవి, కలం అనే పాత సమీకరణం ఇప్పుడు ప్రాంప్ట్, కవి, యంత్రం అనే కొత్త త్రికోణంగా మారిందా? సోషల్ మీడియా కవిత్వాన్ని ప్రజాస్వామ్యీకరిస్తోందా, లేక అల్గారిథమ్‌కు అనుగుణంగా కుదిస్తున్నదా? భవిష్యత్ పాఠకుడు పుస్తకాన్ని చదువుతాడా, లేక దానితో మాట్లాడతాడా? యంత్రం కూడా రాయగలిగినప్పుడు మానవ రచయిత ఎందుకు? ఇవీ ఆ కొత్త ప్రశ్నలు. ఏఐ ఏదైనా సరే అద్భుతంగానే రాసేస్తుందేమోనన్న వాదనను కొట్టిపారేయాల్సిన అవసరం లేదు. "ఏఐ ఎప్పటికీ మనిషిలా రాయలేదు" అని మనల్ని మనం ఓదార్చుకోవడం వంచనే అవుతుంది. అసలు ప్రశ్న–మనిషి ఎందుకు రాస్తాడు? అన్నది. కొన్నిసార్లు మనిషి బతకడానికి రాస్తాడు. ప్రేమ విఫలమైన తర్వాత రాస్తాడు. జైలులో రాస్తాడు. యుద్ధం మధ్య రాస్తాడు. తనను ఎవరూ విననప్పుడు కాగితానికి చెబుతాడు. అంటే రచన ఒక ఉత్పత్తి మాత్రమే కాదు. ఒక మానవ చర్య. కొన్నిసార్లు సాక్ష్యం. కొన్నిసార్లు ప్రతిఘటన. కొన్నిసార్లు తనను తాను కాపాడుకునే ప్రయత్నం. మనిషి యంత్రం ముందు కూర్చుని, "కవిత రాయి" అంటున్నాడు. చూడటానికి సాధారణమైన ఈ వాక్యం సాహిత్య చరిత్రలో అసాధారణమైనది. ఇంతకు ముందెప్పుడూ లేనిది. ఇంతకాలం మనిషి తన కథను మరో మనిషికి చెప్పాడు. ఇప్పుడు తనకోసం కథో, కవితో, వ్యాసమో తయారు చేయమని యంత్రాన్ని అడుగుతున్నాడు. సాహిత్యం మొదట్నుంచీ మనిషిని నిర్వచించడానికి ప్రయత్నించింది. దేవుళ్లు, రాక్షసులు, దయ్యాలు, రోబోలు.. తనకు భిన్నమైన జీవులను ఊహించి వాటిలో తననే చూసుకుంది. ఇప్పుడు ఏఐ ఆ ప్రశ్నను మరింత సంక్లిష్టం చేస్తోంది. మరణించిన భర్త పాత మెయిళ్లు, స్వరం, ఫోటోల ఆధారంగా రూపొందించిన ఏఐ అవతార్‌తో ఒక మహిళ ప్రతిరోజూ మాట్లాడుతుందనుకుందాం. ఆమె ఎవరితో మాట్లాడుతోంది? భర్తతోనా? జ్ఞాపకంతోనా? డేటాతోనా? తన ఒంటరితనంతోనా? ఒక హ్యూమనాయిడ్ "నాకు బాధగా ఉంది" అంటే, అది నిజంగా బాధపడుతోందా అన్నది మాత్రమే ప్రశ్న కాదు. అది బాధపడుతోందని మనిషి నమ్మితే ఆ సంబంధం నిజమవుతుందా? అన్నదే మరింత ఆసక్తికరం. ఒకప్పుడు కవితను సంపాదకుడు ఎంపిక చేసేవాడు. తర్వాత పాఠకుడు ఎంపిక చేశాడు. ఇప్పుడు అల్గారిథమ్ ఎవరికి ఏ కవిత కనిపించాలో నిర్ణయిస్తోంది. పొడవైన ధ్యానాత్మక కవిత కంటే వెంటనే అర్థమయ్యే పంక్తి వేగంగా ప్రయాణిస్తుంది. రెండోసారి చదివినప్పుడు మాత్రమే తెరుచుకునే కవితకంటే మొదటి మూడు సెకన్లలో ఆకట్టుకునే వాక్యానికి ఎక్కువ అవకాశముంటుంది. ఇక్కడ ప్రమాదం రచన చిన్నదవడం కాదు. పాఠకుడి ఓపిక చిన్నదవడం. సోషల్ మీడియా కవిత్వానికి ఒక ప్రజాస్వామ్యాన్నిచ్చింది. ప్రచురణకర్త తలుపు మూసిన కవికి అది కిటికీని తెరిచింది. కానీ ప్రతి ప్రజాస్వామ్యం వెంట మార్కెట్ కూడా వస్తుంది. కవిత చదవటమే కాదు, ఎన్ని సెకన్లు చూసారు, ఎన్ని సార్లు షేర్ అయింది అన్నది కూడా ఆ కవిత ప్రయాణాన్ని నిర్ణయిస్తోంది. ఏఐ ఈ వేగాన్ని మరింత పెంచుతోంది. ఒకే భావానికి పదిరూపాలు క్షణాల్లో తయారవుతాయి "ఇంకా విషాదంగా", "మరింత తాత్వికంగా", "ఇంకా వైరల్ అయ్యేటట్టు". ఇక్కడ కవి ఎదుర్కొనే అసలు ప్రమాదం యంత్రం తన స్థానాన్ని ఆక్రమించడం కాదు. తన స్వరాన్ని తానే గుర్తుపట్టలేని స్థితికి చేరడం. ఇక్కడే సృజన కర్తృత్వం అనే ప్రశ్న వస్తుంది. ఒక కవి ఏఐతో "భర్త చనిపోయిన తర్వాత అతని ఖాళీ కుర్చీతో మాట్లాడుతున్న వృద్ధురాలి మీద కవిత రాయి" అంటాడు. సందర్భం మనిషి ఇచ్చాడు. భావోద్వేగ ఉష్ణోగ్రతను మనిషి నిర్ణయించాడు. పదాలను యంత్రం అమర్చింది. అప్పుడు కవిత ఎవరిది? రచన అంటే వాక్యాలను సమర్థంగా అమర్చడమే అయితే యంత్రమూ రచయితే. కానీ రచన అంటే జీవనానుభవం భాషగా పరివర్తన చెందడం అయితే సమస్య అక్కడ మొదలవుతుంది. యంత్రానికి బాల్యం లేదు. తల్లి ఒడి జ్ఞాపకం లేదు. ప్రేమలో ఎదురుచూపు లేదు. మరణించిన తండ్రి తర్వాత ఇంట్లో ఏర్పడిన ఖాళీ తెలియదు. కానీ వీటన్నింటి గురించి మనుషులు రాసిన కోట్లాది వాక్యాల నమూనాలు దానికి తెలుసు. అంటే యంత్రానికి జ్ఞాపకం లాంటి సమాచారం ఉంది, జ్ఞాపకం లేదు. వేదన గురించి భాష ఉంది, వేదన లేదు. అలాగని మనిషైనా శూన్యంలోంచి రాయడు. కనుక అతని రచన ఒరిజనలేనా అనే ప్రశ్న ఎదురవడం కూడా సమంజసమేనేమో. పదేళ్ల క్రితం ఈ ప్రశ్న అసందర్భం. కానీ ఇప్పుడు ఏఐ రచనా పద్ధతిని శంకిస్తున్న నేపథ్యంలో ఈ ప్రశ్న సరైనదే. అతనిలో చదివిన పుస్తకాలు, విన్న కథలు, ఊరి భాష, పురాణం, చరిత్ర, రాజకీయ అనుభవం అన్నీ ఉంటాయి. తేడా ఏమిటంటే మనిషి వాటిని తన జీవితంతో రంగరిస్తాడు. అవి అతని శరీరం, కాలం, ప్రేమ, అపరాధబోధ, భయం, నష్టం అన్నింటినీ తాకి భాషగానో సృజనగానో మారతాయి. అందుకే ఇక "ఎవరు టైప్ చేశారు?" అనే ప్రశ్న కంటే "ఈ రచనకు నిర్ణయాత్మక సృజనాత్మక బాధ్యత ఎవరిది?" అన్నది ముఖ్యమవుతుంది. దీంతో కాపీరైట్ ప్రశ్న కూడా సంక్లిష్టమవుతుంది. యంత్రం రూపొందించిన వచనానికి హక్కు ప్రాంప్ట్ ఇచ్చిన వ్యక్తిదా? సాంకేతిక సంస్థదా? శిక్షణలో ఉపయోగించిన రచయితలకూ నైతిక వాటా ఉందా? ఏఐ వాడటం తప్పు కాదు. కానీ ఏఐ రాసినదాన్ని పూర్తిగా తానే రాసినట్టు ప్రకటించడం సమంజసమా అన్నది ప్రశ్న. ఇది సాహిత్య నైతికతలో ఏఐ సంధించిన ఒక కొత్త విలువ సమస్య. భవిష్యత్ కథల్లో ఏఐ పాత్రలు మనిషికి ప్రత్యర్థులుగా మాత్రమే ఉండవేమో. అవి ప్రేమికులు, స్నేహితులు, పిల్లలు, సంరక్షకులు, జ్ఞాపకాల ప్రతిరూపాలు కావచ్చు. అప్పుడు సాహిత్యంలో ముఖ్యంగా ఫిక్షన్‌లో "పాత్ర" అనే భావనకే కొత్త నిర్వచనం చెప్పుకోవాల్సుంటుంది. బహుశా భవిష్యత్ పుస్తకం మౌనంగా ఉండదు. "ఈ సంఘటనను కర్ణుడి దృష్టిలో చెప్పు", "ఈ పాత్ర ఎందుకు అబద్ధం చెప్పింది?" అని అడిగితే వెంటనే సమాధానం వస్తుంది. అంటే పుస్తకం వస్తువు నుంచి సంభాషణగా మారిందనమాట. ఈ గొప్ప అవకాశం వెనుక మరో ప్రమాదం కూడా ఉంది. సాహిత్యంలోని గొప్ప ఆనందాల్లో అస్పష్టత ఒకటి. రచయిత చెప్పకుండా వదిలిన ఖాళీలోనే పాఠకుడు తన అనుభవాన్ని చూసుకుంటాడు. ప్రతి మౌనానికీ యంత్రం అర్థం చెప్పేస్తే, పాఠకుడి ఊహకు మిగిలేది ఏమిటి? బహుశా భవిష్యత్తులో మంచి పాఠకుడు ఎక్కువ సమాధానాలు పొందినవాడు కాదు, కొన్ని ప్రశ్నలను యంత్రాన్ని అడగకుండా తనలోనే ఉంచుకోగలిగినవాడు. సాహిత్యం అత్యుత్తమంగా అమర్చిన పదాల సమాహారం మాత్రమే కాదు, జీవితం తనను తాను భాషలో కనుగొన్న క్షణం కూడా. కనుకనే రాబోయే కాలంలో మానవ రచయిత అడగవలసిన ప్రశ్న "యంత్రం ఎంత గొప్పగా రాస్తుంది?" అని కాదు. "యంత్రం కూడా రాయగలిగే ఈ ప్రపంచంలో నేను మాత్రమే రాయవలసినది ఏమిటి?" అని. బహుశా అక్కడే రేపటి సాహిత్యం మొదలవుతుంది. భవిష్యత్తు ప్రశ్న "ఇది మనిషి రాశాడా? యంత్రం రాసిందా?" అని కాకపోవచ్చు. "ఈ రచన వెనుక ఏ రకమైన చైతన్యం, ఎంపిక, అనుభవం, బాధ్యత ఉన్నాయి?" అని కావచ్చు. కనుక "ఆఖరి మానవ రచయిత" వచ్చేస్తున్నాడన్న ఆందోళన ఇప్పుడే అవసరం లేదు. ఏఐతో కలిసి రాసే మొదటి తరం రచయితలు, కవులు, వ్యాసకర్తలు ఇప్పటికే వచ్చేశారన్నదైతే నిజం.

### డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం హైదరాబాద్

## జంతు సంక్షేమం, ప్రజా భద్రతకు ప్రాధాన్యత: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు రెండో బోర్డు తొలి సమావేశం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి అధ్యక్షతన జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వీధి కుక్కల నిర్వహణ, కుక్క కాట్ల నివారణ, ప్రజా భద్రత, జంతు సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ABC రూల్స్–2023 అమలు, ూదీజ కేంద్రాల బలోపేతం, ప్రమాదకర కుక్కల నిర్వహణ, జంతు సంరక్షణ కేంద్రాలు, అత్యవసర పశువైద్య సేవలను మెరుగుపరచడంపై చర్చించారు. చిన్నారులు, ప్రజలు, రహదారి భద్రతతో పాటు ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో జంతువుల పట్ల చట్టబద్ధమైన, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్యారోగ్య, విద్య, పోలీస్ శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో జయేష్ రంజన్ IAS, డా. కె. ఇలంబర్తి IAS, డా. బి. గోపీ IAS, ప్రొఫెసర్ జ్ఞానప్రకాశ్, దివ్య దేవరాజన్ IAS, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్‌లైఫ్) క్షితిజ, GHMC, CMC, MMC కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు



వేకువ సమయం సెప్టెంబర్ 21 కీసర ప్రతినిధి : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా, నిబంధనల ప్రకారం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 106 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

**ప్రతి అర్జీపై చర్యలు తీసుకోవాలి**

ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం స్వీకరించడంతోనే సరిపెట్టకుండా, దాని పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో అందిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, వాటిపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులపై చేపట్టిన చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**బాధితుల సమస్యలకు ప్రాధాన్యత**

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్న నేపథ్యంలో ప్రతి అర్జీని సానుకూల దృక్పథంతో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమస్య పరిష్కారానికి నిబంధనలు అనుకూలంగా ఉన్న సందర్భాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖల పరిధిలో లేని అంశాలను తగిన అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉందనే నమ్మకం కలిగేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు నామని సత్యనారాయణకు నివాళులు



దేవరకొండ: సెప్టెంబర్ 21 (సమయం ప్రతినిధి) : దేవరకొండ: తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు నామని సత్యనారాయణకు దేవరకొండ పట్టణంలో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని నివాళులర్పించారు. సాయిశివ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులను పరామర్శించి, నామని సత్యనారాయణ సేవలను స్మరించుకున్నారు.

**చోళ్ళేటి భాస్కరాచారి కుటుంబానికి ఎమ్మెల్యే బాలు నాయక్ పరామర్శ**

దేవరకొండ పట్టణంలోని 16వ వార్డుకు చెందిన మాజీ స్వర్ణకారి సంఘం అధ్యక్షుడు చోళ్ళేటి భాస్కరాచారి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భాస్కరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**పాతనబోయిన భారతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే**

దేవరకొండ పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పాతనబోయిన భారతమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పున్న వెంకటేశ్వర్లు, ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, దొండేటి మల్లారెడ్డి, ఆయా వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై యువతకు అవగాహన కల్పించాలి



వనపర్తి. సమయం ప్రతినిధి : పోలీస్ శాఖ పనితీరు మెరుగుపరచడం, గ్రామాల్లో నిఘా పెంచడం మరియు యువత డ్రగ్స్ కు బానిస కాకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మదనాపూర్ ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు. అనంతరం మహేందర్ నాయుడు మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన పోలీస్ సిబ్బంది రోజూ గ్రామాల్లో తిరిగే విధంగా చూడాలని, గ్రామంలో ఏ సమస్య ఉంది, ఏం జరుగుతుంది అనే సమాచారాన్ని సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణను డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చాలని ప్రతిష్టాత్మక కార్యక్రమం తీసుకున్నారని, కానీ మదనాపురం మండలంలో అమలు కావడం లేదన్నారు. డ్రగ్స్ కు బానిసలైన యువత... మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్ ను అరికడితేనే నేరాలు తగ్గుతాయన్నారు. ఇటీవల కాలంలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో యువత గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమని, దీనిని అరికట్టడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాని కోరారు. గ్రామాల్లో బీట్ కానిస్టేబుల్ వ్యవస్థను బలోపేతం చేసి, ఉదయం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహించి, గ్రామ పెద్దలు, యువజన సంఘాలతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు.

## కీసర డివిజన్-1 కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తటాకం లక్ష్మణ్ శర్మ

వేకువ సమయం సెప్టెంబర్ 21 కీసర ప్రతినిధి : కీసర డివిజన్–1 కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తటాకం లక్ష్మణ్ శర్మ నియమితులయ్యారు. తనపై పూర్తి నమ్మకంతో పార్టీ కీలక బాధ్యతలు అప్పగించినందుకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కీసర డివిజన్–1 కాంగ్రెస్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డిలకు లక్ష్మణ్ శర్మ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ శర్మ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా పార్టీకి, ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం సూచనలు, కార్యకర్తల సహకారంతో కీసర డివిజన్–1లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## గణనాథా.. ప్రజలందరినీ చల్లగా చూడయ్యా

**–చర్ల తండాలో మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



దేవరకొండ: నేరేడుగోమ్ము: సెప్టెంబర్ 21 (సమయం ప్రతినిధి) : నేరడుగొమ్ము మండలం చర్ల తండాలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. అన్నదానం మహాదానం అని అన్నారు. భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని గణనాథుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. పండుగలు కేవలం భక్తి, ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా సేవాభావాన్ని, మానవతా విలువలను పెంపొందించేలా ఉండాలని పిలుపునిచ్చారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఉషా దయాకర్ రావు గారిని, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులను, నిర్వాహకులను అభినందించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని రమావత్ రవీంద్ర కుమార్ గారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుమార్, మాజీ చైర్మన్ ముక్కమల్ల బాలయ్య, బొడ్డు గోపాల్ గౌడ్, అరేకంటి రాములు, పల్స వెంకటయ్య, దాసు, అరేకంటి విజయ్, కుంటిగోర్ల నాగరాజు, వడత్య బాలు, బొడ్డుపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.







# మక్తల్‌లో ఘనంగా స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ

**యువతకు వివేకానంద జీవితం దిక్సూచి**
**- మంత్రి వాకిటి శ్రీహరి**
**వివేకానందుడి జీవన విధానం నాకు స్ఫూర్తి. ..**
**మంత్రి వాకిటి శ్రీహరి**





మక్తల్ : భారతదేశ యువతకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు, ప్రపంచానికి భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పిన స్వామి వివేకానంద విగ్రహాన్ని మక్తల్ గడ్డపై ఆవిష్కరించుకోవడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్‌లో నిర్వహించిన స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద విగ్రహాన్ని కేవలం ఒక విగ్రహంగా చూడకూడదని, ఇది యువతకు దిక్సూచి, విద్యార్థులకు స్ఫూర్తి, సమాజానికి సందేశం, భవిష్యత్ తరాలకు బాధ్యత అని అన్నారు. "లేవండి... మేల్కొండి... లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి" అనే స్వామి వివేకానంద సందేశం ప్రతి యువకుడి జీవితానికి మార్గదర్శకమని మంత్రి పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద చిన్న వయసులోనే తన ఆలోచనలు, ప్రసంగాలతో ప్రపంచాన్ని ప్రభావితం చేశారని మంత్రి గుర్తుచేశారు. యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఎవరైనా మంచి విద్యార్థిగా ఎదగవచ్చని, మరొకరు ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని, ఇంకొకరు క్రీడాకారుడిగా, శాస్త్రవేత్తగా, పారిశ్రామికవేత్తగా లేదా సమాజ సేవకుడిగా ఎదగవచ్చని మంత్రి అన్నారు. ఏ రంగంలో ఉన్నా మనం చేసే పని సమాజానికి ఉపయోగపడేలా ఉండటమే నిజమైన విజయమని మంత్రి పేర్కొన్నారు. స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా బలమైన, జ్ఞానవంతమైన, క్రమశిక్షణ కలిగిన, దేశభక్తి ఉన్న యువతను నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మక్తల్ యువత ఎదగాలి... మక్తల్ అభివృద్ధి చెందాలి... తెలంగాణ యువత దేశానికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ ఏడాది ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ తెలంగాణ కు ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు. స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు తెలిపారు. ఈ విగ్రహం మక్తల్ యువతలో స్ఫూర్తిని నింపుతూ, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులు పంపిణీ



అమరచింత : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖల మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం, TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు,అమరచింత మండల పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) 20 చెక్కులు అంచనా విలువ 7,22,500 రూపాయల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే పరిస్థితి లేని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు CMRF ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఒక అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలిచి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా పాలనలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకొని, వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నాయకులు అన్నారు. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు ఆర్థిక భారం కొంతమేర తగ్గించే విధంగా CMRF సహాయం అందించడం అభినందనీయమని తెలిపారు. అలాగే, తమ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సహాయాన్ని పొందేలా అవసరమైన సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ ,అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి రవికాంత్ , అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్, వైస్ చైర్ పర్సన్ ఎస్. రాధ అరుణ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు తోఫిక్ గారు, మణెమ్మ డేవిడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమలాకర్ గౌడ్, ధర్మపురం సర్పంచ్ సావిత్రమ్మ శ్రీనివాస్, ఎస్టి సెల్ అధ్యక్షుడు హనుమంతు నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి , మాజీ జెడ్పీటిసి వెంకటయ్య, మండల నాయకులు వీరేష్ గౌడ్, శ్రీరామ్ నరేష్ యాదవ్ , నాగల్ కడుమూరు గ్రామ అధ్యక్షులు జగన్ రెడ్డి , పామ్ రెడ్డి పల్లి గ్రామ అధ్యక్షుడు బిసి రెడ్డి , మోహన్ రెడ్డి, భగవంతు రెడ్డి, నాయర్ పాషా , అమరచింత మండల సోషల్ మీడియా ఇంచార్జ్ రవికుమార్, నాయకులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులుస్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 26న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 21 వేకువ సమయం ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను సెప్టెంబర్ 26, 2026న కంబాలపల్లి చెరువు వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని సహజ సౌందర్యం, చెరువులు, జలపాతాలు, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రదేశాలను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు, జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. కంబాలపల్లి చెరువుతో పాటు బయ్యారం చెరువు, గుంజేడు ముసలమ్మ దేవాలయం, కురవి వీరభద్రస్వామి దేవాలయం, బీముడి పాదం జలపాతం తదితర పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సుందరీకరణ, సందర్శకులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళలు, సంప్రదాయాలు మరియు జిల్లా సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, స్థానిక కళాకారులు, హస్తకళాకారులు, చిన్న వ్యాపారులు మరియు ఇతర వర్గాలకు ఆర్థిక అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పర్యాటక రంగానికి చెందినవారు, అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. "మహబూబాబాద్ జిల్లా ప్రకృతి సౌందర్యం, చారిత్రక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రపంచానికి పరిచయం చేసి, పర్యాటక రంగం ద్వారా స్థానికంగా ఉపాధి మరియు ఆర్థిక అవకాశాలను పెంపొందించడమే లక్ష్యం" అని జిల్లా కలెక్టర్ తెలిపారు. తేదీ: 26 సెప్టెంబర్ 2026వేదిక: కంబాలపల్లి చెరువు, మహబూబాబాద్ జిల్లా కార్యక్రమం: ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లాలోని యువత, ప్రజలు, పర్యాటకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ సోమవారం ఒక్క ప్రకటనలో తెలిపారు.

# నేడు జూరాల ప్రాజెక్ట్ ని సందర్శించనున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు



అమరచింత : 22-09-2026 వ రోజు ఉదయం 9.30 గంటలకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు మక్తల్ నియోజకవర్గం లోని జూరాల ప్రాజెక్టు ని సందర్శించి ప్రాజెక్ట్ దిగువన ఉన్న ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపైన రైతులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారని, ఇట్టి కార్యక్రమంలో అమరచింత, ఆత్మకూరు మండలాలలోని అన్ని గ్రామాల రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# వరద లేనప్పుడు జూరాలలో జలాలు వదిలేస్తే తాగునీటికి ఇబ్బందులు ఏర్పడవా కేటీఆర్..? మంత్రి జూపల్లి



వనపర్తి : గతంలో సాధారణంగా జురాలకు రోజుకూ 8 వేల నుంచి 10వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చేవని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు వర్షాభావం కారణంగా రోజుకూ కనీసం 300 క్యూసెక్కులు కూడా రావడం లేదని తెలిపారు... వచ్చే 2027 జూన్, జులై నాటికి తాగునీటికి నీళ్లు కావాలన్నారు. పైనుంచి వరద లేనప్పుడు ఉన్న జలాలు వదిలిస్తే తాగునీటికి ఇబ్బందులు ఏర్పడవా అని కేటీఆర్?ను మంత్రి ప్రశ్నించారు.. వచ్చిన నీళ్లు వచ్చినట్లు ఒడిసిపట్టుకోవాలని చెప్పే కేసీఆర్.. జురాల కింద 5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పుడు ఎందుకు రిజర్వాయర్లు నిర్మించలేదని నిలదీశారు. 20 టీఎంసీలతో గట్టు రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్ పదేండ్లలో ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు...గూడెందొడ్డిని గాలికొదిలేశారని ఆరోపించారు. ఎర్రవల్లి ఫాంహౌజ్‌కు మాత్రం పుష్కలంగా కాళేశ్వరం జలాలు వచ్చేలా రిజర్వాయర్లు నిర్మించుకున్నారని ఆక్షేపించారు.

# ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీపీ షుగర్లు ఫ్రీ చెకప్ క్యాంప్



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం జిల్లెడబండ గ్రామపంచాయతీ సర్పంచ్ డి. నాగేష్ నాయుడు గారి ఆధ్వర్యంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జిల్లెడబండ మరియు మర్లపల్లి ప్రజలకు ఉచితంగా బీపీ షుగర్ చెక్ అప్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లెడబండ మరియు మర్లపల్లి అంగన్వాడి కేంద్రాలలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య,ANM శ్రీమతి రాధా, ప్రాథమిక పాఠశాల HM శ్రీలత అంగన్వాడీ టీచర్స్ అరుణాదేవి, ప్రశాంతి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.







# చేనగ చెరువు కట్ట, సంత బజార్ అభివృద్ధి పనులకు భూమిపూజ

**కొత్తకోట:** దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో చేనగ చెరువు కట్ట మరియు సంత బజార్ అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవానమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తకోట పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. చేనగ చెరువు కట్ట అభివృద్ధితో పాటు సంత బజార్‌ను ఆధునీకరించడం ద్వారా స్థానిక ప్రజలకు, వ్యాపారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.





## పెబ్బేర్ యువకుడు గౌతమ్‌కి ఎంబీబీఎస్ సీటు....



వనపర్తి : పెబ్బేరు పట్టణం 3వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయుడు శ్రీదేవి కుమారుడు గౌతమ్‌కు సిద్దిపేట మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఈ సందర్భంగా వనపర్తిలోని తన స్వగృహంలో లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గౌతమ్‌ను ఘనంగా సన్మానించారు.శాలువా కప్పి సత్కరించిన అనంతరం స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. వైద్య విద్యలో రాణించి భవిష్యత్తులో ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, గంధం పరంజ్యోతి, వెంకట్ సాగర్, గౌడ నాయక్, జోహేబ్ హుస్సేన్ చిట్యాల రాము, ఫజల్ గోపాల్ నాయక్, తోట శీను, తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ఎడమ కాలువ ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



అమరచింత, సెప్టెంబర్ 21: జూరాల కెనాల్ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీటి సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, సూచించారు. సోమవారం జూరాల డ్యాం వద్ద ఎడమ కాలువ ప్రాంతాన్ని ఎస్పీ స్వయంగా పరిశీలించి, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రైతుల సమస్యలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రైతులు తమ సమస్యలను శాంతియుతంగా తెలియజేసే సమయంలో సంయమనం పాటించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రాంపల్లిలో గణేశ్ మండపం వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన
## గణేశ్ మండపాన్ని పరిశీలించిన పోలీసు అధికారులు



వేకువ సమయం సెప్టెంబర్ 21 కీసర ప్రతినిధి : కీసర: గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రాంపల్లిలోని జై మాతా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాన్ని సోమవారం పోలీసు అధికారులు సందర్శించి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. మండపం వద్ద భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి తీసుకున్న చర్యలను అధికారులు పరిశీలించారు.ఏసీపీ చక్రపాణి, ట్రాఫిక్ ఏసీపీ, ట్రాఫిక్ ఎస్ఐ, కీసర ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐ అనిల్ మండపాన్ని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.మండపం పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, భక్తుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్వాహకులు కూడా పోలీసుల సూచనలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించాలని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు, స్థానిక ప్రజలకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. భక్తులు కూడా పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ కార్మికులతో తీన్మార్ మల్లన్న భేటీ.!
## పాత జలగలను నమ్మి మోసపోవద్దు.. మేల్కోండి.!

హైదరాబాద్ : తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఈరోజు నిర్వహించిన పాదయాత్రలో ఆర్టీసీ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమం, హక్కులు, మరియు ఆత్మగౌరవం కోసం నిజాయితీగా నిరంతరం పోరాడే ఏకైక నిజమైన ప్రత్యామ్నాయం బహుజన్ వర్కర్స్ యూనియన్ మాత్రమేనని మల్లన్న స్పష్టం చేశారు. కార్మికుల కష్ట సుఖాల్లో తోడుంటూ, వారి న్యాయమైన డిమాండ్ల సాధనే ఏకైక లక్ష్యంగా ఈ సంఘం పని చేస్తుందని మల్లన్న భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఈ యూనియన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. పాత సంఘాల లీడర్లు కార్మికులను కేవలం తమ స్వార్థానికే వాడుకున్నారని మండిపడ్డారు. మాట తప్పితే యూనియన్ రద్దు.నా ప్రాణం పోయినా సరే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయించి తీరుతాం. ఒకవేళ విలీనం చేయించకపోతే..ఈ బహుజన్ వర్కర్స్ యూనియన్‌నే రద్దు చేస్తా! ఇది ఆర్టీసీ కార్మికులకు నా ప్రాణ సాక్షిగా ఇస్తున్న మాట " అని మల్లన్న ఓపెన్ ఛాలెంజ్ చేశారు. కార్మికులకు నిజమైన అండగా నిలిచే బహుజన్ వర్కర్స్ యూనియన్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు.



## పెబ్బేరు సంతలో అక్రమ వసూలను ఆపాలని,
## సిపిఎం పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు




వనపర్తి : పెబ్బేరు సంతలో కొంతమంది కాంట్రాక్టర్లు సంతకు వచ్చే వ్యాపారులతో అక్రమ వసూలను ఆపాలని డిమాండ్ చేస్తూ పెబ్బేరు ప్రజావాణిలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. పురపాలక సంఘం అనుమతి లేకుండానే కొంతమంది కాంట్రాక్టర్లు పురపాలక సంఘం పేరుతో ఉన్న రసీదులతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు ప్రతి శనివారం సంతలో వ్యాపారం చేసుకునే ప్రజల నుండి దాదాపు 12 లక్షల రూపాయల నుండి 14 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు సంతలు వేల మంది కుటుంబాలు తమ జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని జీవిస్తున్నారు. కూరగాయలు, హోటల్స్, తాళ్లు, కోళ్లు, మేకలు, పొట్టేలు, బర్రెలు, ఎద్దులు తదితర రకాలైన వ్యాపారాలు చేసుకుని పేద మధ్య తరగతికి చెందిన ప్రజలు జీవిస్తున్నారు అలాంటివారితో మేమే సంత కాంట్రాక్టర్లని పురపాలక సంఘం రసీదులతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు తేదీ01-04-2024 నుండి2026 నేటి వరకు కాంట్రాక్టర్లు ఫుల్ చేసిన డబ్బులు దాదాపు 17 కోట్ల 42 లక్షల రూపాయలు. ఇందులో పురపాలక సంఘానికి రావలసిన నిధులు 8 కోట్ల 71 లక్షలు రూపాయలు కానీ ఒక్క రూపాయి కూడా పురపాలక సంఘానికి చెల్లించలేదు ఇట్టి డబ్బులను సంతలో కాంట్రాక్టర్లు వ్యాపారం చేసుకునె ప్రజలతో పీడించి వసూలు చేశారు వసూలు చేసిన డబ్బులు మొత్తం కాంట్రాక్టర్ లే స్వాహా చేశారు ఇంత జరుగుతున్న పురపాలక సంఘం పాలకవర్గంగాని, పురపాలక సంఘ అధికారులు గానీ అక్రమంగా డబ్బు వసూలు చేసిన కాంట్రాక్టులపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది కావున పురపాలక సంఘం అనుమతి లేకుండానే వసూలు చేసిన డబ్బులు మొత్తాన్ని రికవరీ చేయాలని అక్రమంగా డబ్బు వసూలు చేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోగలరని మరియు పురపాలక సంఘం అనుమతి లేని అక్రమ డబ్బు వసూళ్లపై విచారణ జరిపి వెంటనే నిలిపివేలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సిపిఎం పెబ్బేరు మండల కార్యదర్శి జి బాలయ్య సిపిఎం నాయకులు ఆర్ దేవన్న ఎం వెంకటస్వామి పి ఉషన్న ఆర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జూరాల ఆయకట్టు కింద

### ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వమంటే అక్రమ అరెస్టులా
### హైదరాబాద్లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అరెస్ట్

హైదరాబాద్ : జూరాల ఆయకట్టు కింద పంటలు ఎండుతున్నాయి రైతులకు సాగునీళ్లు విడుదల చేయాలని రైతుల పక్షాన నిలబడ్డ జిల్లా బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.శ్రీశైలం నుంచి 660 కిలోమీటర్ల దూరంలో పెన్నా బేసిన్‌లో ఉన్న కుప్పానికి నీళ్లు తీసుకెళ్లామని ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు జలహారతులు ఇస్తుంటే.. పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేస్తోంది.కృష్ణా జలాలను పోతిరెడ్డిపాడు, వెలిగొండ, మాల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా 100 టీఎంసీలకు పైగా ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టి తెలంగాణ రైతుల గొంతు కోశారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పడావు పెట్టి రైతుల నోట్లో మట్టి కొట్టారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు చేస్తున్న ద్రోహం ఇదే.జూరాల ప్రాజెక్టును పోలీసులు పూర్తిగా దిగ్బంధించి, భారీగా పోలీసు బలగాలను మోహరించి, కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారు. రైతులు నీళ్లు అడుగుతుంటే వారి చేతులకు సంకెళ్లు వేస్తారా? ప్రస్తుతం జూరాలలో 8.8 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. తాగునీటికి 2 టీఎంసీలు కేటాయించినా, వారబంధి కింద సాగునీళ్లు విడుదల చేసి లక్ష ఎకరాలను కాపాడవచ్చు.ఆల్మట్టిలో 123 టీఎంసీలు, నారాయణ్‌పూర్‌లో 32 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది. సొంత జిల్లా రైతుల కోసం కనీసం ఆ 155 టీఎంసీలలో 5 టీఎంసీల నీటిని తీసుకురాలేరా?కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో నీటిని లిఫ్ట్ చేయకుండా భీమాలో మూడు పంపులు ఉంటే ఒక్క పంపునే, నెట్టెంపాడులో కూడా ఒక్క పంపునే నడిపి ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం వహించారు.నీళ్లను ఒడిసి పట్టుకోకుండా వదిలిపెట్టి తెలంగాణకు జలద్రోహం చేసింది మీరు. తప్పు మీరు చేస్తే.. శిక్ష రైతులు అనుభవించాలా?పంట పొలాలకు సాగునీళ్లు ఇవ్వడం చేతకాని ప్రభుత్వం.. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు.జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీళ్లు విడుదల చేయాలని, అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.







# రైతుల ధర్నాతో దద్దరిల్లిన జమ్మిచెడు



- రైతులకు అండగా BRS
- రైతులకు నీరు ఇచ్చేవరకు వరకు పోరాడుతాం...
రైతులకు వెంటనే నీరు విడుదల చేయాలని,రైతులతో కలిసి,రోడ్డుపై బేటాయించి,ధర్నా చేసి,పెద్ద ఎత్తున నిరసన తెలిపిన మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు

గద్వాల : గద్వాల జిల్లా కేంద్రంలోని జమ్మి చెడు దగ్గర రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ... గద్వాల – కర్నూల్ ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులు,రైతులతో కలిసి,వరి నాట్లను పట్టుకొని బేటాయించి,ధర్నా చేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.... 24 గంటల్లోపు రైతులకు నీళ్లు ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడం తో ధర్నాను విరమించారు...అంతక ముందు, కలెక్టరేట్ నుంచి జమ్మిచేడు వరకు రైతులతో కలిసి ర్యాలీగా వచ్చి,కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....జూరాల కుడి కాలువల గేట్లను ఎందుకు మూసివేశారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బాసు శ్యామల గారు డిమాండ్ చేశారు. రైతులకు తక్షణమే జూరాల నీటిని విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి నీటిని ఆంధ్రా ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర రైతుల నోట్లో మట్టి కొట్టి.. నీటిని ఆంధ్రాకు ధారాదత్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ పటాలు పరిశీలించండి జూరాల నుంచి నీళ్లు ఎందుకు ఇస్తలేవని వారు ప్రశ్నించారు. మీ గురువు చంద్రబాబు నాయుడు కళ్ళలో ఆనందం చూడడం కోసమా అని నిలదీశారు. పాలమూరును పండబెడుతున్న పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి అని అన్నారు. మన నీటిని వాడుకోవడానికి నిర్బంధాలా? ఎవరి కోసం మీరు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించేది అని ప్రశ్నించారు.. రాహుల్ గాంధీ కోసమా లేక చంద్రబాబు నాయుడు కోసమా అని నిలదీశారు... తక్షణమే జూరాల గేట్లను ఎత్తి రైతులకు నీళ్లు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రైతులు ఉద్యమిస్తారని.. అప్పుడు రేవంత్ సర్కార్ మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. రైతులకు జూరాల నుంచి నీటిని విడుదల చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

## ప్రజలకు తక్షణ సేవలు అందించడం కోసమే డివిజన్, మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు - జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 21 వేకువ సమయం : సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధి అడ్వకేట్ ఆనంద్ కుమార్, కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు, స్నేహ శబరిష్.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత అనేకంగా సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో డివిజనల్, మండల స్థాయిలలో పాటు జిల్లా కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలలో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు.ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ మండలం జామాండ్లపల్లి గ్రామానికి చెందిన కొణతం లలిత తనకు చెందిన రిజిస్ట్రేషన్ గల భూమి 22 ఎ నిషేదిత ఆస్తుల జాబితాలో ఉన్నదని తన యాజమాన్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు తన వద్ద ఉన్నాయని అధికారులు రికార్డులను పరిశీలించి 22 ఎ జాబితా నుండి తన భూమిని తొలగించాలని కోరారు. గార్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ దేవ్లా సీతారామ ప్రాజెక్ట్ క్రింద తన భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నారని అట్టి పరిహారం తన బ్యాంకు ఖాతాలో కాకుండా వేరొకరి బ్యాంకు ఖాతాలో జమచేయడం జరిగిందని అట్టి పరిహారాన్ని తనకు ఇప్పించగలరని కోరారు. బయ్యారం మండలం జగత్రావు పేట కు చెందిన పాయం వాలమ్మ తనకున్న వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ తొ చదును చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు అట్టి భూమి ఫారెస్ట్ భూమని సాగుచేసుకునేందుకు వీలు లేదని అడ్డు కుంటున్నారని తనకు తగిన న్యాయం చేసి తన భూమిని సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన ( 120 ) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ముఖ్యమంత్రి గారు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి చేయాలన్నారు, జిల్లాలోని జిల్లా, డివిజనల్ , మండల కేంద్రాల్లో నీ, ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ విధానం ద్వారా తమ ముఖచిత్రాలతో కూడిన హాజరు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్ని విభాగాల ప్రధాన అధికారులను ఆదేశించారు, ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల సౌకర్యం నిర్వహించే ఇంటర్నెట్ సౌకర్యాలను తెలంగాణ టి ఫైబర్ ఇంటర్నెట్ సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినందున తమ కార్యాలయాలలో వర్క్ ఆర్డర్ వెంటనే ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తొమ్మిదవ జాతీయ పోషణ మాసం మా అంగన్వాడి, మా బాధ్యత. సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 9 వరకు జరిగే కార్యక్రమాల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ ప్రజావాణిలో డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, సిపిఓ,వి. శ్రీనివాసరావు, ఉద్యానవల్ల అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ట్రైబల్, ఎస్సీ, బిసి సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాసరావు, శ్రీజ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, జిఎం ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ రెడ్డి, డిపిఓ రేవంత్, డిసిఓ, సర్దార్ సింగ్, ఎల్డీఎం యాదగిరి, ఇన్చార్జి వెల్ఫేర్ అధికారిని కె.శిరీష, డిఎస్ఓ రమేష్, డి ఎం సివిల్ సప్లై నరసింహారావు, ఎడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ శ్రీనివాసులు, క్రీడల అధికారి జ్యోతి, ఎడి మైనింగ్ వెంకట రమణ, ఉపాధి కల్పనా అధికారి రజిత, మెప్మా డీఎంసి విజయ, ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర, అడిషనల్ డిఆర్డిఓ మల్లీశ్వరి, జిల్లా ఆస్పత్రి సూపరిటెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, ఇన్చార్జి డిఈఓ శ్రీరాములు, టిపిఓ సాయిరాం, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరిడెంట్లు మదన్ గోపాల్, రాజేష్, దామోదర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 14 వ వర్ధంతి వేడుకలు



దేవరకొండ, సెప్టెంబర్ 21 (సమయం ప్రతినిధి) : దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. ఆయన విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, బహుజనుల కోసం, చేనేత కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేసినటువంటి యోధుడని, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో తన వంతు పాత్రను పోషించినటువంటి గొప్ప నాయకుడు శాసనమండలి, అసెంబ్లీలోను బీసీల కోసం సుదీర్ఘ పోరాటం చేసినటువంటి నాయకుడని కొనియాడారు. ఈయన ఆశయ సాధన కోసం యువత, మహిళలు, విద్యార్థులు బహుజనులు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, గడ్డం బిక్షమయ్య , పున్న భిక్షమయ్య, అప్పం వీరయ్య, డాక్టర్ భాషా చౌహాన్, భీమగోని శివ గౌడ్, రావిరాల వీరయ్య, పులిజాల శ్రీనివాసులు, వనం మహేష్ ,శివాజీ, పులిజాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్తత.. నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలంటూ నిరసన..

హైదరాబాద్: నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్యాంక్ బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆందోళనకు దిగారు. నిమజ్జనంపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్ బండ్ వద్ద బైఠాయించారు. నిరసనలో భాగంగా అక్కడ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను ఉత్సవ సమితి ప్రతినిధులు తొలగించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పలువురు పోలీసులు కిందపడిపోయారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌పై గణేశ్ నిమజ్జనానికి అనుమతి ఇవ్వాల్సిందేనని భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. బారికేడ్లను తొలగించిన అనంతరం వారు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ట్యాంక్ బండ్ పరిసరాల్లో భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా, గణేశ్ నిమజ్జనం వేళ ట్యాంక్ బండ్ వద్ద ఆంక్షలపై ఉత్సవ సమితి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ, ట్యాంక్ బండ్ వద్ద సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ట్యాంక్ బండ్ వద్ద నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# ఏపీ జలదోపిడికి సహకరిస్తున్న తెలంగాణ సర్కార్ మాజీ ఎమ్మెల్యే



దేవరకద్ర : భూత్పూర్ మండలం అన్నా సాగర్ గ్రామంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రెస్ మీట్. నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాటలు వివరాల ప్రకారం జూరాల లో నీళ్ళున్నప్పటికీ పంటలు ఎండిపోతున్నాయి...రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తుంటే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు.ప్రజల కోసం పోరాటం చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్ట్ చేస్తున్నారు.ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపుతామనే ముందస్తు అరెస్ట్ చేస్తున్నారు.ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నాం. ఎనిమిదిన్నర టీఎంసీలు ఉన్నప్పటికీ సాగునీళ్లు ఎందుకు ఇవ్వడం లేదు.పాలమూరు జిల్లాలో మిషన్ భగీరథ శ్రీశైలం నీళ్ల మీద ఆధారపడి నడుస్తుంది. గద్వాల అలంపూర్ నియోజకవర్గ తాగునీటి అవసరాలు మాత్రమే జూరాల తీరుస్తుంది. ఆ రెండు నియోజకవర్గాలకు రెండు టీఎంసీలతో సంవత్సరం పాటు నీళ్లు ఇవ్వచ్చు. ఐదు టీఎంసీలు నీళ్లతో వానాకాలం పంటను బ్రతికించవచ్చు.జూరాలకు వరద వచ్చినప్పటికీ మళ్లింపు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. శ్రీశైలానికి నీళ్లు వదిలేందుకు ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపెట్టింది. పరోక్షంగా ఏపీ జల దోపిడీకి కాంగ్రెస్ సర్కార్ సహకరించింది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటర్లను కంటిన్యూగా నడపడంలో ప్రభుత్వం విఫలమైంది. కృష్ణ నీళ్లను ఏపీ వాడుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూస్తుంది.రైతులు నీళ్లు కరెంటు యూరియా అడుగుతున్నారు. కాంగ్రెస్ నాయకులు కండువా కప్పుకుంటేనే నీళ్ళు కరెంటు వస్తాయని రైతులకు చెప్తున్నారు. కండువా కప్పుకుంటేనే కాలువ తవ్వుతామని వెలికిచర్ల రైతులను పార్టీలో జాయిన్ చేసుకున్నారు. సాగునీళ్ల విషయంలో దేవరకద్ర ఎమ్మెల్యే అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు నిరంతరాయంగా సాగునీళ్లు ఎలా వచ్చాయి. ఇప్పుడు ఎందుకు బంద్ అయ్యాయి. ఎమ్మెల్యేకు మూడేళ్ల తర్వాత కాల్వ గుర్తుకు వచ్చింది. కాంగ్రెస్ ప్రాధాన్యత ప్రజలు కాదు. నిత్యం రాజకీయాలే చేస్తున్నారు. సాగునీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేదు. వరద నీటిని ఒడిసిపట్టడంలో కాంగ్రెస్ విఫలమైంది. వరద వచ్చినప్పుడు నీటిని ఎత్తిపోయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.ఎత్తిపోతల పథకాల మోటర్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదు. ఈ సీజన్లో తెలంగాణ 18 టీఎంసీలు వాడుకుంటే... ఏపీ 100 టీఎంసీలకు పైగా తరలించుకుపోయింది.మూడేళ్ల తర్వాత కూడా ఇంకా కేసీఆర్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు సీఎం దగ్గరికి వెళ్లి నీళ్ల గురించి మాట్లాడండి. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది. నీళ్లు విడుదల చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోండి. వానాకాలం పంట కాపాడండి. ఐదు టీఎంసీలు ఇవ్వమని చెప్పండి. రైతులను తప్పుదోవ పట్టిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారు. మరోవైపు విద్యుత్ సమస్యలతో రైతులు రోడ్డు ఎక్కుతున్నారు.విద్యుత్,సాగునీటి సమస్యలు ఉన్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యేలు సమస్యలను ప్రస్తావిస్తుంటే కూడా ప్రభుత్వం పరిష్కరించడం లేదు. జూరాల నుండి సాగునీళ్లు విడుదల చేసేవరకు బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. రైతులకు అండగా నిలుస్తూ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తాం. పంటలకు సాగునీళు వచ్చే విధంగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. పంటలు ఎండిపోకుండా కాపాడే బాధ్యత జిల్లా టిఆర్ఎస్ నాయకులు తీసుకుంటాం. రైతుబంధు ఇస్తున్నామని మంత్రి వాకిటీ శ్రీహరి మాట్లాడారు. రైతులకు బిక్షం ఇస్తున్నారా... కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతుబంధు వేశారు. మీ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిందని విమర్శలు చేశారు.

# అన్ని శాఖల సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌లో తప్పనిసరిగా నమోదు

**వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదైన సిబ్బందికే వేతనాలు**
**అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశాలు**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 21:** నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. మండల, డివిజన్, క్లస్టర్, గ్రామ స్థాయిల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగిని ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, సిబ్బంది నమోదు ప్రక్రియను ఈ నెలలోపు పూర్తి చేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ హాజరు ఏర్పాట్లు అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం లతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ............ అన్ని శాఖల సిబ్బంది హాజరు, వాస్తవ సిబ్బంది సంఖ్యను ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. కొన్ని శాఖల్లో సిబ్బంది ఇంకా ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన ఉద్యోగుల సంఖ్యను పరిశీలించాలని సూచించారు. నమోదు కాని సిబ్బందిని వెంటనే ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన తదితర శాఖలు ఇప్పటికే తమ శాఖలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను వినియోగిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన శాఖల సిబ్బంది అందుబాటులో ఉన్న ఈ-ఎస్‌పీఎస్ ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థను ఉపయోగించి హాజరు నమోదు చేయాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు ఈ డి ఎం తో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు, హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి శాఖ అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాని సిబ్బంది వివరాలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదయ్యే హాజరుకు అనుగుణంగా వేతన చెల్లింపులపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత శాఖల అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్ ఆధారిత హాజరు నమోదును క్రమబద్ధీకరించాలని, అధికారులు తమ పరిధిలోని సిబ్బంది హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.



## మున్నూరు రవీందర్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి



వనపర్తి, సమయం ప్రతినిధి : హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అడ్వకేట్ మున్నూరు రవీందర్‌కు బీజేపీ తరఫున టికెట్ కేటాయించాలని వనపర్తి జిల్లా బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని అడ్వకేట్ మున్నూరు రవీందర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ, మున్నూరు రవీందర్‌కు సుదీర్ఘకాలంగా పార్టీతో అనుబంధం ఉందని, ఆయన సేవలను పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి అవకాశం కల్పించాలని కోరారు. 1980 నుంచి బీజేపీ కోసం సేవలందిస్తున్న మున్నూరు రవీందర్, 1969 నుంచి బాల స్వయం సేవక్‌గా పనిచేసినట్లు తెలిపారు. గట్కేసర్‌లో పార్టీ బాధ్యతలు నిర్వహించడంతో పాటు, 1975 ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయినట్లు పేర్కొన్నారు. స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా రెండు పర్యాయాలు, 2002లో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పనిచేసినట్లు వివరించారు. 1987-2003 మధ్య వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ బాధ్యతలు నిర్వహించారని, 1994లో వనపర్తి నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. పాదయాత్రలు, పల్లెపల్లె నిద్ర కార్యక్రమాలు, కేడెద్దుల ప్రదర్శనలు, బుల్లాక్ కార్ట్ ర్యాలీలతో పాటు అనేక పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నట్లు వివరించారు. పాత మహబూబ్‌నగర్ జిల్లాలో తమ కుటుంబానికి మంచి గుర్తింపు ఉందని మున్నూరు రవీందర్ తెలిపారు. తన తండ్రి మున్నూరు కృష్ణయ్య డిగ్రీ కళాశాలను స్థాపించి బోధనా, బోధనేతర సిబ్బందికి ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. తాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు ఎన్నికైనట్లు, పలు బ్యాంకులకు ప్యానెల్ అడ్వకేట్‌గా సేవలందించినట్లు తెలిపారు. పార్టీ కోసం ఇన్నేళ్లుగా సేవలందించిన తనకు హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ కేటాయించాలని రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ అభ్యర్థిత్వానికి వనపర్తి జిల్లా నాయకులు మద్దతు ప్రకటించి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు గారిని హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ నియోజకవర్గం ప్రస్తుత ఎమ్మెల్సీగా సురభి వాణీదేవి ఉన్నారు; ఆమె పదవీకాలం మార్చి 2027లో ముగియనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ రికార్డులు, తాజా వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి. వనపర్తి జిల్లాకు చెందిన పార్టీ నాయకులకు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంలో అవకాశం కల్పించాలని జిల్లా నాయకులు రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, కేతూరి బుడ్డన్న, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ పాల్గొన్నారు.

## ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు.. ప్రారంభించనున్న అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ (ANTF) చీఫ్‌ల 3వ జాతీయ సదస్సును రేపు(మంగళవారం) ఢిల్లీలో నిర్వహించనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. దేశంలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఇందులో భాగంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయనున్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి 2026-29 నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్‌లో నిర్దేశించిన లక్ష్యాలపై సదస్సులో చర్చ జరగనుంది. రాష్ట్రాల్లో అమలవుతున్న చర్యలు, ఎదురవుతున్న సవాళ్లు, సమాచార మార్పిడి, దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పనిచేస్తున్న డ్రగ్ కార్టెల్స్‌ను గుర్తించి, వాటిని ఛేదించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా కొత్త రకాల సింథటిక్ డ్రగ్స్, వాటి తయారీకి ఉపయోగించే సీక్రెట్ ల్యాబొరేటరీస్, అక్రమ సరఫరా నెట్‌వర్క్‌లను గుర్తించి అడ్డుకోవడంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని జరుగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా కూడా సదస్సులో కీలకం కానుంది. డార్క్‌నెట్ ద్వారా జరుగుతున్న డ్రగ్స్ విక్రయాలు, క్రిప్టోకరెన్సీ ఆధారిత లావాదేవీల వంటి నేరాలను గుర్తించడం, వాటిపై సమర్థంగా దర్యాప్తు చేయడం, నిందితుల ఆర్థిక నెట్‌వర్క్‌లను ఛేదించడం వంటివి ఇందులో ఉన్నాయి.

# ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి... రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 21 వేకువ సమయం ప్రతినిధి : 2026-27లో భూసేకరణకు రూ.6 వేల కోట్ల నిధులు విడుదల. ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల.. లబ్ధిదారులకు పరిహారం చేరేలా చర్యలు చేపట్టాలి. అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులు తక్షణమే పూర్తి చేయాలి. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి, ప్రతి వారం పురోగతిపై సమీక్షించాలి. రైతులతో సంప్రదింపులు జరిపి నిబంధనల ప్రకారం, మార్కెట్ విలువకు సమీపంగా పరిహారం అందించాలి. నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబాబాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుండి కలెక్టర్ స్నేహ శబరిష్, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లి పాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఇతర పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్ఓ నాగలక్ష్మీ, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు రాజేశ్వరీ, గణేష్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్-2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి






మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 21 వేకువ సమయం ప్రతినిధి);ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలిఅక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం, హైదరాబాదు నుంచి ఎస్ఐఆర్-2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ , ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్-2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు. ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై, సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, డి ఆర్ ఓ నాగలక్ష్మి, ఆర్డీవోలు రాజేశ్వరి గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, సూపరిండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు



**వేకువ సమయం న్యూస్// మంచిర్యాల సెప్టెంబర్ 21, 2026 :** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి రహదారి భద్రత సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు, నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారులపై వాహనాలు నిలపకుండా రహదారులు భవనాలు, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలు, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ జిల్లాలో 2026 సంవత్సరంలో ఇప్పటివరకు 429 ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాలలో 95 మంది మృతి చెందారని తెలిపారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి కన్నాల ప్రాంతంలో, నస్పూర్ లోని కలెక్టరేట్ కమాన్ ప్రాంతంలో రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 63 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 133 మందిని అరెస్టు చేసి 35 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లా మాధ్యమిక విద్యాధికారి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో అబ్నార్మల్ బిహేవియర్ ఉన్న విద్యార్థులను గుర్తించి సంబంధిత ఎస్ హెచ్ ఓ కు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డి అడిక్షన్ కేంద్రాలలో అవసరమైన కిట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీపీ సమన్వయ సమావేశం

**వేకువ సమయం న్యూస్ //రామగుండం :** పెద్దపల్లి వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పోలీస్,సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ,విద్యుత్, వైద్య ఆరోగ్య, ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక,ఫిషరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు,భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సీపీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, వినాయక నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగే నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.గత సంవత్సరం నిమజ్జనం సందర్భంగా ఎదురైన సమస్యలు, ఇబ్బందులు, లోపాలను సమీక్షించి,అవే సమస్యలు ఈ సంవత్సరం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, రద్దీ ప్రాంతాలు,పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఫిషరీస్,సంబంధిత శాఖల అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు రక్షణ సిబ్బంది, శిక్షణ పొందిన ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు, అవసరమైన రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు,లైటింగ్, రోడ్ల పరిస్థితి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన మార్గాలు, మండపాలు, నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను ముందుగానే పరిశీలించి,ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఫైర్ టెండర్లు, సిబ్బంది, రక్షణ పరికరాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలని తెలిపారు.సింగరేణి అధికారులు తమ పరిధిలోని నిమజ్జన మార్గాలు, రహదారులు, సంబంధిత ప్రాంతాల్లో అవసరమైన సహకారం అందించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ అధికారులు నిమజ్జన శోభా యాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ,రద్దీ నిర్వహణ, బందోబస్తు, పార్కింగ్,క్రేన్‌లు, ఇతర అత్యవసర సేవల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్, ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, జైపూర్ సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఆయుర్వేద అవగాహన సదస్సు...






**జోగులాంబ గద్వాల:** సెప్టెంబర్ 23 న నిర్వహించనున్న అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం-2026ను పురస్కరించుకొని ఈరోజు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రెండవ రైల్వే గేట్ సమీపంలో ఉన్న ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఆయుర్వేద అవగాహన సదస్సు నిర్వహించారు.జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డా. వి. క్రాంతి కుమారి ఆధ్వర్యంలో, జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు ఆయుర్వేద వైద్య విధానం, ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన కల్పించారు. అనంతరం సుమారు 30 మంది వయోవృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డా. వి. క్రాంతి కుమారి మాట్లాడుతూ, ఆయుర్వేద జీవన విధానాన్ని ఆచరించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ముఖ్యంగా వయోవృద్ధులు ఆహార నియమాలు, వ్యాయామం, క్రమబద్ధమైన జీవనశైలిని పాటించాలని సూచించారు. "ఆయుర్వేదాన్ని ఆచరిస్తూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు.వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సహకరించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు, వైద్య సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు... ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా చైర్మన్ సంగాల అయ్యపు రెడ్డి రాష్ట్ర కార్యనిర్వాక సభ్యులు జి.రమేష్,జిల్లా కార్యనిర్వాక సభ్యులు గంగాధర్ గౌడ్ అప్సర్ పాషా , కరాటే శ్రీహరి గారు, అక్బర్ బాషా,మహేష్ నాయుడు,యోగ నిర్వాహకులు భీమేష్, రాజు, శ్వేత, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు...

## గణేశుని లడ్డూ ను దక్కించుకున్న సర్పంచ్ వెన్నెల శేఖర్: దిల్ రాజు రూ. 4.50 లక్షలకు లడ్డూ కైవసం





**నాగర్‌కర్నూల్ సమయం ప్రతినిధి: సెప్టెంబర్ 21:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పాటలో తెలకపల్లి మండల పరిధి లోని గడ్డంపల్లి గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ అరుదైన భక్తిని చాటుకున్నారు. హైదరాబాదు లోని ప్రముఖ చలనచిత్ర నిర్మాత దిల్ రాజు గారి కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేశుని లడ్డూ వేలం పాటలో సర్పంచ్ వెన్నెల శేఖర్ సోమవారం ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డు వేలం పోటీ నడుమ సాగిన ఈ వేలం పాటలో ఆయన అత్యధికంగా రూ. 4 లక్షల 50 వేలు పలికి పవిత్రమైన వినాయక లడ్డూను కైవసం చేసుకున్నారు. గణనాథుని ప్రసాదాన్ని దక్కించుకోవడంపై సర్పంచ్ వెన్నెల శేఖర్ ఈ సందర్భంగా తీవ్ర హర్షాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేశారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ లడ్డూ ప్రసాదం దక్కడం భగవంతుని కృపగా భావిస్తున్నానని, ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు గడ్డంపల్లి గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. వినాయకుని దయతో గ్రామంలోని ప్రతి ఇల్లూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అలాగే తమ గడ్డంపల్లి గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేలం కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొని "గణపతి బప్పా మోరియా" అంటూ జయజయధ్వనాలు చేశారు.

# ఘన చరిత్ర కలిగిన గోర్ సమాజం

**నూటికి నూరు పుట్టుకతోనే అందం**
**బానోతు సురేష్ నాయక్ రాష్ట్రీయ గోర్ సేన జిల్లా అధ్యక్షులు**



**మహబూబాబాద్ జిల్లా: (సెప్టెంబర్ 21 వేకువ సమయం):**గోర్ సమాజము ఈ దేశంలో ఘన చరిత్ర కలిగిన సమాజము. గోర్ బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు ప్రత్యేక గుర్తింపు కలిగిన ప్రత్యేక గౌరవం కలిగిన వారలము, మరోక ముఖ్య విషయం సుమారుగా 20-25 కోట్ల జనాభా కలిగిన గోర్ సమాజము, మాట్లాడే భాష గోర్ బోలి గొప్ప వేశధారమములు వినసొంపుగా చూడముచ్చటగా దాదాపుగా నూటికి నూరు శాతం పుట్టుకతోనె సహజ సిద్ధముగా అందంగానే ఉంటారు. నేడు గోర్ సమాజంలో జన్మించిన వారు తన గొప్ప చరిత్ర తెలుసుకోవడానికి కనీస ప్రయత్నం చేయడం లేదు. కనీసం అహర్నిశలు కృషి చేస్తున్న వారికి గుర్తించలేక పోతున్నారు.నా సమాజానికి నేను ఏమీ చేయాలి. ?సమయము కేటాయించాలా? జ్ఞానము అందించాలా ? ఆర్థికంగా మద్దతు ఇవ్వాలా? అనేది కనీస ఇంగిత జ్ఞానం ఉండాలి కదా !

1) సిక్కులు చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
2) ముస్లింలు చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
3) క్రిస్టియన్ లు చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
4) యూదులు చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
5) పార్శీలూ చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
6) జైనులు చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
7) బౌద్దులు చూడండి వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.
8) కులం పరంగా చూసినట్లయితే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, మార్వాడీలూ, మొదలైన వారికి చూడండి, వారి సంస్కృతి, వారి ఐక్య మత్యం వారి ఆర్థిక బలం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినారు.

మనకెందుకు వస్తలేదు సోయి ?
గోర్ సమాజానికి సంపూర్ణంగా వాడుకుని బ్రతుకు చున్నాము కదా ! ఇంతో అంతా తెలిసిన తరమే మనము మరి రాబోయే తరానికి ఏమిటి మీ సమాధానం? విచారం వ్యక్తం చేయండి.
జై గోర్, మెరమా య్యాడి జై సేవాలాల్ జై నాయక్ కాశీనాథ్. జై భారత్.




**సమయం ప్రతినిధి:** అంతరిక్ష రంగంలో చైనా మరోసారి తన సత్తా చాటింది. కేవలం రెండు రోజుల వ్యవధిలో నాలుగు రాకెట్ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించింది. వీటిల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు, ప్రైవేటు సంస్థల రాకెట్ ప్రయోగాలు కూడా ఉండటం విశేషం. శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు, భూపరిశీలన కోసం చైనా సంస్థలు సెప్టెంబర్ 15, 16 తేదీల్లో ఈ ప్రయోగాలను మూడు వేర్వేరు వేదికల నుంచి దిగ్విజయంగా నిర్వహించాయి. అవసరాల మేరకు త్వరిత గతిన శాటిలైట్‌లను ప్రయోగించే సత్తా తమకు ఉందని చైనా మరోసారి నిరూపించింది. సెప్టెంబర్ 15న జికువాన్ శాటిలైట్ లాంఛ్ సెంటర్‌లో తొలి ప్రయోగం విజయవంతమైంది. ప్రైవేటు సంస్థ లాండ్‌స్పేస్ అభివృద్ధి చేసిన జుక్యు-2ఈ రాకెట్ పది ఉపగ్రహాలను దిగ్విజయంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బాండ్ సేవల కోసం ఉద్దేశించిన కియాన్‌ఫాన్ నెట్‌వర్క్ కోసం ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ నెట్‌వర్క్‌లో భాగంగా మొత్తం 10 వేల బ్రాడ్‌బాండ్ శాటిలైట్‌లను కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.అదే రోజున ఓరియన్ స్పేస్ అనే ప్రైవేటు సంస్థకు చెందిన గ్రావిటీ-1 రాకెట్‌తో మరో తొమ్మిది కియాన్‌ఫాన్ రాకెట్లను దిగ్విజయంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ప్రపంచంలో ఘనరూప ఇంధనాన్ని వినియోగించే అత్యంత శక్తిమంతమైన రాకెట్‌గా గ్రావిటీ-1కు పేరుంది. సముద్రంలోని నౌక నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించడం గమనార్హం.ఇక చైనా ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మార్చ్-12 రాకెట్‌తో మూడో ప్రయోగాన్ని అద్భుతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శాట్‌నెట్ బ్రాడ్‌బాండ్ సేవల కోసం మొత్తం 9 శాటిలైట్లను దిగువభూక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 13 వేల శాటిలైట్‌లతో ఈ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌ను నిర్మించాలని చైనా ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ అనుబంధ సంస్థ చైనా ఎయిరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలుగో ప్రయోగం నిర్వహించారు. భూపరిశీలన కోసం క్యాయ్‌జో-11 రాకెట్ ద్వారా రెండు శాటిలైట్‌లను విజయవంతంగా ప్రయోగించారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085